నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | బుధవారం 2 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఎమ్మెల్యే వస్తేనే సన్నబియ్యం !

పంపిణీ కార్యక్రమం నిలిపివేయడంపై విమర్శలు

బెల్లంపల్లి, ఏప్రిల్ 1 : రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ఉదయం ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మాత్రం చేపట్టలేదు. లబ్ధిదారులు రేషన్ దుకాణాలకు రాగా మూసి ఉండడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేతుల మీదుగా ప్రారంభించేందుకే పంపిణీ చేయలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం తెలుసుకొని రేషన్ షాపుల వద్ద బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ నిరసన తెలిపారు. ఎమ్మెల్యే ప్రారంభించే వరకు బియ్యం పంపిణీ చేయవద్దని రేషన్ డీలర్లకు ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫోన్లు చేసి దుకాణాలు మూయించారని ఆరోపించారు. బియ్యం పంపిణీ చేయకుండా లబ్ధిదారులకు ఇబ్బంది కలిగించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే పది రోజుల వరకు రాకపోతే పేదలు పస్తులు ఉండాల్సిందేనా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై లబ్ధిదారులతో పాటు వివిధ పార్టీలు, సంఘాల నుంచి విమర్శలు రావడంతో సాయంత్రం నుంచి షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేశారు.

అలా ప్రారంభించారు.. ఇలా నిలిపివేశారు..

కాసిపేట, ఏప్రిల్ 1 : కాసిపేట మండలంలోని ఆయా గ్రామాల్లో రేషన్ షాపుల వద్ద సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించిన కొద్దిసేపటికి నిలిపివేశారు. రేపు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తారని, అప్పటి వరకు నిలిపి వేయాలని ఆదేశాలు రావడంతోనే నిలిపివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై కాసిపేట తహసీల్దార్ భోజన్నను వివరణ కోరగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేతుల మీదుగా అధికారిక ప్రారంభోత్సవం ఉంటుందని ఉన్నతాధికారులు తెలుపగా నిలిపివేసినట్లు చెప్పారు.

బెల్లంపల్లిలో రేషన్ దుకాణం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్

ఆసిఫాబాద్‌లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

సన్న బియ్యం పంపిణీ

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 1: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని హడ్కో కాలనీలో గల రేషన్ దుకాణం (6)లో మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండేతో కలిసి లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందించే సన్న బియ్యం పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి ఆరు కిలోల చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో సాయన్న, డీటీ పోచయ్య, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రేగుంట కేశవ రావు, రేషన్ డీలర్ వరలక్ష్మి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకు కృషి

వాంకిడి, ఏప్రిల్ 1 : అనారోగ్యంతో బాధపడుతున్న పేదలను సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో వాంకిడి మండలంలోని బంబార గ్రామానికి చెందిన లబ్ధిదారుడు గర్నులే నారాయణకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు, బంబార గ్రామం బీఆర్ఎస్ యువనాయకులు అశోక్, శైలేష్, తిరుపతి తదితరులు ఉన్నారు.

డీలర్ల మెడపై కత్తి

- సన్న బియ్యం విక్రయిస్తూ ఎవరైనా దొరికినా కేసులు తప్పవు
- అధికారుల నిర్ణయాలతో హడలెత్తిపోతున్న రేషన్ డీలర్లు
- బ్యాక్‌లాగ్ బియ్యం తీసుకెళ్లాలంటూ విజ్ఞప్తి



రేషన్ దుకాణాలు 1,712

రేషన్ కార్డులు 7.59 లక్షలు

ఉమ్మడి జిల్లాలో రేషన్ లబ్ధిదారులు

లబ్ధిదారులు 24.12 లక్షలు

కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు 72,276

కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు 1.55 లక్షలు

మంచిర్యాల, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉగాది సందర్భంగా రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేసింది. ఇప్పటి వరకు చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల్లో లోటుపాట్లున్న నేపథ్యంలో సన్న బియ్యం పంపిణీనైనా విజయవంతం చేయాలనే ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఈ మేరకు ఇప్పటికే రేషన్ షాపులకు స్టాక్ సరఫరా చేశామని చెప్తున్నారు. కొత్తగా రేషన్‌కార్డులు మంజూరై పౌర సరఫరా శాఖ పోర్టల్‌లో పేర్లున్న వారికి సన్నబియ్యం ఇస్తామని చెప్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా రేషన్ డీలర్ల విషయంలో సర్కారు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తున్నది. గతనెల వరకు రేషన్ షాపులకు పంపిణీ చేసిన దొడ్డు బియ్యంలో కొంత బ్యాగ్‌లాగ్ స్టాక్ మిగిలింది. ఈ నెల నుంచి సన్న బియ్యం ఇవ్వనుండడంతో ప్రతి షాప్‌కు పుల్ అలైన్‌మెంట్ ఇచ్చారు. బ్యాక్‌లాగ్ ఉన్న దొడ్డు బియ్యాన్ని తీసుకెళ్లలేదు. ఈ బియ్యానికి మీదే బాధ్యత అంటూ డీలర్లపైనే ఆ భారం పెట్టేశారు. వారం, పది రోజుల క్రితం ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వచ్చిన అధికారులు ప్రతి రేషన్ షాపు తిరిగి ఎంత స్టాక్ మిగిలిందనే లెక్కలను నమోదు చేసుకున్నారు. ఆ బస్తాల పక్కన డీలర్లను నిలుచోబెట్టి ఫొటోలు తీసుకున్నారు. బియ్యం స్టాక్ దించిన ప్పుడు ఈ బియ్యాన్ని తిరిగి తీసుకెళ్తామని చెప్పి నప్పటికీ ఇప్పటి దాకా ఆ బియ్యాన్ని అధికారులు తీసుకెళ్లలేదని రేషన్ డీలర్లు చెప్తున్నారు. బ్యాక్‌లాగ్ దొడ్డు బియ్యానికి మమ్ములను బాధ్యులు చేయడం ఏంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా వరకు షాపులను అద్దెకు తీసుకుని నడిపిస్తున్నామని, పాత స్టాక్‌కు సెక్యూరిటీ ఇచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. గతంలో కంది పప్పును డీలర్ల వద్దే ఉంచి అవి పూర్తిగా పాడయ్యాక చలాన్లు కట్టమన్నారని, ఈ బియ్యం మంచిగ ఉన్నప్పుడు చలాన్లు కట్టామంటే కడుతాం కానీ పాడయ్యాక కట్టిస్తే ఇబ్బంది అవుతుందంటున్నారు. డీలర్ల వద్దే వదిలేసిన బ్యాక్‌లాగ్ బియ్యం స్టాక్‌లను వెంటనే తీసుకెళ్లాలని లేదా చలాన్లు కట్టించుకుని మాకు వదిలేసినా తీసివేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్తున్నారు. ఈ విషయంలో వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని డీలర్లు కోరుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కొన్ని వందల క్వింటాళ్ల బ్యాక్‌లాగ్ బియ్యం రేషన్ షాపుల్లోనే ఉండిపోయినట్లు తెలుస్తున్నది.

విక్రయిస్తే డీలర్లపై కేసులు

ఇప్పటి దాకా రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యాన్ని తినేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. ఆ బియ్యాన్ని కిలోకు రూ.10 నుంచి రూ.15 చొప్పున బయట అమ్ముతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలా దొడ్డు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే కొందరు ప్రైవేటు వ్యాపారులు.. ఆ బియ్యాన్ని కిలోకు రూ.18 నుంచి రూ.25 చొప్పున మహారాష్ట్రకు తీసుకెళ్లి విక్రయించిన సొమ్ము చేసుకునేవారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఈ దందాకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పెట్టింది పేరు. పక్కనే మహారాష్ట్ర బార్డర్‌లో డెన్‌లు ఏర్పాటు చేసుకుని రేషన్ బియ్యాన్ని తరలించుకుని పోయేవారు. అధికారులు ఎవరు తింటున్నారు సార్. అమ్మేస్తున్నారు.. ఏం చేయమంటారు అంటూ చెప్పుకొచ్చేవారు. ఇప్పుడు సన్న బియ్యం ఇస్తున్న నేపథ్యంలో ఆ బియ్యం పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. ఈ విషయాన్ని అధికారులు ఇటీవల జిల్లా కేంద్రాల్లో రేషన్ డీలర్ల మండలాధ్యక్షులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో చెప్పారు. రేషన్‌షాపు చుట్టుపక్కల ఎవరైనా సన్నబియ్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తే అది డీలర్ ప్రోద్బలంతో జరిగినట్లుగానే భావిస్తామని, మీ మీదే కేసులు పెడతామని అధికారులు హెచ్చరించినట్లు తెలిసింది. ఈ తీరుపై డీలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సన్నబియ్యం పంపిణీ చేయడం వరకే తమ బాధ్యత అవుతుందని, లబ్ధిదారులు దాన్ని బయటికి విక్రయిస్తే మమ్ములను బాధ్యులను చేయడం ఏంటని మండిపడుతున్నారు. రేషన్ బియ్యంతో వ్యాపారం చేసే వ్యక్తులను వదిలేసి మమ్ములను బాధ్యులను చేయడం ఏంటని నిలదీస్తున్నారు.

సర్కార్ ఫ్లెక్సీలో పార్టీ పైత్యం.. ప్రారంభించింది పార్టీ లీడర్లే..

సన్న రేషన్ బియ్యం పంపిణీ నేపథ్యంలో అన్ని రేషన్ షాపుల సమీపంలో సర్కారు ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలపై తెలంగాణ ప్రభుత్వ లోగో ముద్రించారు. కానీ మంచిర్యాల నియోజకవర్గవ్యాప్తంగా రేషన్‌షాపుల్లో ఏర్పాటు చేసిన గవర్నమెంట్ ఫ్లెక్సీల్లో ఎంపీ వంశీకృష్ణ ఫొటో కనిపించలేదు. పోనీ స్థానిక ఎమ్మెల్యే ఫొటోతో పాటు సీఎం, మంత్రుల ఫొటోలు ఉండి ఎంపీ ఫొటో పొరపాటున మిస్ అయ్యింది అనుకునేలానూ అది లేదు. ఫ్లెక్సీలో కలెక్టర్ ఫొటో పక్కనే మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఫొటో ముద్రించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లోగోతో రూపొందించిన ఫ్లెక్సీలో ఎంపీ ఫొటో లేకుండా డీసీసీ అధ్యక్షురాలి ఫొటో ఉండడంపై పలువురు కాంగ్రెస్ నాయకులే అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు, ఇతర నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో పార్టీ లీడర్ల పేర్లు ఉన్నాయంటే ఏమో అనుకోవచ్చు. కానీ ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇకపోతే కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుచోట్ల రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తోపాటు మాజీ కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఇలా ప్రభుత్వ కార్యక్రమంలో అధికార పార్టీ లీడర్లు ఇష్టారాజ్యం చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

లక్షెట్టిపేట గోదావరి రోడ్డులో షాప్ నంబర్ 13లో సర్కార్ లోగోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో డీసీసీ అధ్యక్షురాలి ఫొటో, ఇందులో ఎంపీ ఫొటో లేకపోవడం గమనార్హం

న్యాయం చేయాలని పోరాడితే అక్రమ కేసులా?

చెన్నూర్‌నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు డా.రాజారమేశ్

చెన్నూర్‌లో కోర్టు ఎదుట నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్ టౌన్, ఏప్రిల్ 1 : తెలంగాణ ప్రజలకు న్యాయం చేయాలని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు డా.రాజారమేశ్ ధ్వజమెత్తారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆయన చెన్నూర్ కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, రైతులకు ఇస్తామన్న రైతు భరోసా, రుణమాఫీపై ప్రశ్నిస్తూ ధర్నా చేసినందుకు బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన 17 మంది నాయకులపై అక్రమ కేసులు పెట్టి కోర్టుకు లాగిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి 420 హామీలు, ఆరు గ్యారెంటీలు అమలు చేసేవరకూ ఎన్ని కేసులు పెట్టినా ప్రజల తరుపున పోరాడుతామని స్పష్టం చేశారు. సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు రామ్‌లాల్ గిల్డా, ఎండీ నవాజొద్దీన్, సాధనబోయిన కృష్ణ, మల్లెల దామోదర్ రెడ్డి, మంతి బాపు, మోతె తిరుపతి, ఐత సురేశ్ రెడ్డి, పెద్దపోలు సాంబ గౌడ్, రేవెల్లి మహేశ్, మేడ సురేశ్ రెడ్డి, బుర్ర రాకేశ్ గౌడ్, షఫీ, కొప్పుల రవీందర్, భోగె భారతి, కొండపర్తి వెంకటరాజం, తదితరులు కోర్టులో హాజరయ్యారు.

హెచ్‌సీయూ భూముల జోలికి వస్తే ఊరుకోం

సీపీఎం, ఎస్ఎఫ్ఐ నిరసన

కాగజ్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆసిఫాబాద్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కాగజ్‌నగర్ /సీసీసీ నస్పూర్ /ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 1 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికి వస్తే ఊరుకోబోమంటూ వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. భూముల వేలంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను ఎస్ఎఫ్ఐ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను కాపాడాలని పోరాడితే తమ సంఘం నాయకులను అక్రమంగా అరెస్టులు చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి సాయికృష్ణ, ఉపాధ్యక్షుడు భీమేశ్, తదితరులు పాల్గొన్నారు. ఆసిఫాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీపీఎం నాయకులు దహనం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా ఆక్రమించుకుంటున్నారనీ, చివరికి విద్యాసంస్థల భూములను కూడా వదలడం లేదని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూములను కాపాడాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను ఈడ్చుకుంటూ లాక్కెళ్లి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్‌లో సీపీఎం నాయకుల అరెస్ట్

హెచ్‌సీయూలో భూముల వేలానికి నిరసనగా సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘం హైదరాబాద్‌లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్న నేపథ్యంలో నస్పూర్‌లో ఆ పార్టీ నాయకులు మిడివెల్లి రాజ్‌కుమార్, పాయిరాల రాములు, సత్యనారాయణను పోలీసులు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆపి ప్రజాపాలనపై దృష్టిసారించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

64.32 శాతం ఆస్తిపన్ను వసూలు

మంచిర్యాల కార్పొరేషన్ సిబ్బందికి అభినందన

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 1: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో 64.32 శాతం ఆస్తిపన్ను వసూలు చేశారు. మొత్తం రూ. 26.39 కోట్లు వసూలు చేయడం లక్ష్యంగా ఉండగా అందులో రూ. 16.97 కోట్లు వసూలయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31న ఒక్కరోజే రూ.73 లక్షలు వసూలుచేశారు. కొత్తగా ఏర్పాటైన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో నస్పూర్ మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలను విలీనం చేశారు. దీంతో మొత్తం 48923 భవనాలు ఉండగా అందులో 45072 నివాస భవనాలు, 1979 నాన్ రెసిడెన్స్ భవనాలు, 1872 మిక్స్‌డ్ యూసేజ్ భవనాలు ఉన్నాయి. వీటినుంచి గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను రూ. 17.03 కోట్లు, జరిమానా రూ. 1.01 కోట్లు, పాతబకాయిలు రూ. 5.58 కోట్లు, పాతబకాయిలపై జరిమానా రూ. 2.75 కోట్లు కలిపి మొత్తం 26.39 కోట్లు వసూలు చేయడం లక్ష్యంగా ఉండగా ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ. 16.97 కోట్లు వసూలుచేశారు. 50 శాతం కూడా కష్టతరమైన పరిస్థితుల్లో కార్పొరేషన్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి శ్రమించడంతో 64 శాతం వసూలును సాధించారు. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులు కార్పొరేషన్‌కు సులభంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. నెల రోజుల పాటు శ్రమించిన సిబ్బందిని మంగళవారం కార్పొరేషన్ మేనేజర్ విజయ్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

కార్పొరేషన్ సిబ్బందిని అభినందిస్తున్న అధికారులు

పాటగూడ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎన్‌హెచ్ఆర్సీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్

నీటి సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం

'నమస్తే'కథనంపై స్పందించిన ఎన్‌హెచ్ఆర్సీ జిల్లా చైర్మన్, కన్వీనర్

కెరమెరి, ఏప్రిల్ 1: మండలంలోని బాబేఝరి గ్రామపంచాయతీ పాటగూడలో ఏర్పడిన తాగునీటి సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్, జిల్లా కన్వీనర్ కోవ ఇందిరా అన్నారు. మార్చి 27న 'నమస్తే' తెలంగాణ దినపత్రికలో 'పాటగూడ పానీ పాట్లు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు మంగళవారం పాటగూడ గ్రామాన్ని సందర్శించారు. అక్కడి ఆదివాసీలతో మాట్లాడి గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో ప్రస్తుతం బావినీటిని వాడుకుంటున్నామని, అది సైతం వచ్చే నెలలో అడుగంటి పోయే పరిస్థితి ఉందన్నారు. ముందస్తు చర్యలు చేపట్టకపోతే గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. అందుకే సత్వరమే పరిష్కారానికి కలెక్టర్‌ను కలిసి పరిస్థితిని వివరించనున్నట్లు పేర్కొన్నారు. వారి వెంట ఎన్‌హెచ్ఆర్సీ కెరమెరి వైస్ చైర్మన్ రాథోడ్ అర్జున్, గ్రామస్తులు ఉన్నారు.